సాక్షి నిర్మల్

బుధవారం । 1 । నవంబర్ । 2023

లెక్క దాటితే చిక్కే!



రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఎన్నికల రణరంగంలో పైచేయి సాధించడానికి అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిర్దేశించింది. హద్దు దాటితే అనర్హత వేటు పడే ప్రమాదమూ ఉంది. 10లో▸

కలాం జయంత్యుత్సవాలు

నిర్మల్: స్వాతంత్ర సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలను జిల్లా కేంద్రంతోపాటు నిర్మల్ నియోజకవర్గంలోని మండలాల్లో బుధవారం నిర్వహిస్తున్నట్లు కలాంగుణం సొసైటీ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 11వరకు ప్రతీరోజు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2/21.1

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం కాస్త ఎండగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మంత్రికి రూ.200,016 చెక్కు అందజేత



మంత్రికి చెక్కు అందజేస్తున్న రైతులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి పాక్‌పట్ల, గాంధీనగర్, పోచం పహాడ్, మాదాపూర్ గ్రామాల రైతులు మద్దతుగా నిలిచారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం రూ.200,016 చెక్కును విరాళంగా అందించారు. పాక్ పట్ల నుంచి జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వరకు రైతులు మంగళవారం 25 ట్రాక్టర్లలో ర్యాలీగా తరలివచ్చారు. పాక్ పట్లలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా నామినేషన్ ఖర్చు కోసం ఈ చెక్కును అందజేసినట్లు రైతులు తెలిపారు. విరాళం ఇచ్చిన రైతులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి తీరు అమానవీయం

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: కత్తిపోటు గాయంతో క్రిటికల్ కండిషన్‌లో మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నీచంగా మాట్లాడుతున్నాడని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి విమర్శించారు. కోడికత్తి డ్రామా అని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీకి కుట్రలు, కుతంత్రాలు కొత్త కాదని, హత్యా రాజకీయాల చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి, ఎన్నికల్లో ఓటమి ఖాయమని భావించి రేవంత్‌రెడ్డి హింసా రాజకీయాలకు దిగుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. పచ్చబడ్డ తెలంగాణలో చిచ్చుపెట్టే కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

జామ్ యువకుడికి బంగారు పతకం



గోల్డ్ మెడల్ అందుకుంటున్న సచిన్

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన నేరడిగొండ సచిన్ 2021–22 విద్యాసంవత్సరానికి ఎంఏ జర్నలిజంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన 83వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. సచిన్ జర్నలిజంపై మక్కువతో ఉస్మానియా యూనివర్సిటీలో సీటు సాధించాడు. కోర్సులో ప్రతిభ కనబర్చడంతో ఆయనను గోల్డ్ మెడల్ వరించింది.

ప్రచార రథాల తనిఖీ



ప్రచార రథం తనిఖీ చేస్తున్న ఎస్సై..

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామ సమీపంలో మంగళవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన ప్రచార రథాలను తనిఖీ చేశారు. ప్రచార రథాల అనుమతి పత్రాలు, లౌడ్ స్పీకర్లను పరిశీలించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో డబ్బులు తీసుకెళ్లేవారు అనుమతి పత్రాలు వెంట తెచ్చుకోవాలని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వాహనదారులు, ప్రయాణికులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రవి, లక్ష్మణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ అనుమతులకు మధ్యవర్తులను నమ్మొద్దు

ఖానాపూర్: పట్టణ పరిధిలో నూతనంగా ఇంటిని నిర్మించుకునే వారు అనుమతుల కోసం మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించొద్దని ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, లైసెన్స్‌డ్ ఇంజినీర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన టీఎస్‌బీపాస్ అమలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి అనుమతులు టీఎస్ బీపాస్ ద్వారానే తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తే జిల్లా టాస్క్‌ఫోర్స్ ద్వారా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాబ్ క్యాలెండర్ కావాలె..!

- ఉచితాలు వద్దు.. ఉద్యోగాలు ఇవ్వండి..
- పరీక్షల ఫీజులు తగ్గించాలె..
- 'కేంద్రాలు' అందుబాటులో ఉండాలె..
- కొత్త సర్కార్ ఈ విషయంపై దృష్టి పెట్టాలి
- 'సాక్షి పీపుల్స్ మేనిఫెస్టో'లో నిరుద్యోగ యువత



కావేరి లైబ్రరీలో 'సాక్షి పీపుల్స్ మేనిఫెస్టో'లో పాల్గొన్న నిరుద్యోగ యువతీయువకులు

నిర్మల్:'అన్ని ఉద్యోగాలిస్తాం.. ఇన్ని ఉద్యోగాలిస్తాం.. అని చెప్పడం కాదు. పక్కాగా ప్రతీ ఏడాది ఎప్పుడు ఏ నోటిఫికేషన్ ఇస్తారు, ఎప్పుడు పరీక్ష పెడతారు, ఎన్నిరోజుల్లో ఫలితాలు ప్రకటిస్తారు, ఏ తేదీన పోస్టింగ్ ఇస్తారు.. ఇలా యూపీఎస్సీ తరహాలో మన రాష్ట్రంలోనూ పకడ్బందీగా జాబ్ క్యాలెండర్ కావాలె. యువత జీవితాలతో ఆడుకోకుండా.. ప్రతీ పరీక్ష పక్కాగా నిర్వహించాలె..' అంటూ నిరుద్యోగ యువత ముక్తకంఠంతో తమ 'మేనిఫెస్టో' ఇదేనంటూ గొంతెత్తింది. ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' జిల్లాకేంద్రంలోని కావేరి లైబ్రరీ హాల్‌లో మంగళవారం 'పీపుల్స్ మేనిఫెస్టో' చర్చా వేదిక నిర్వహించింది. ఇందులో వందకు మందికి పైగా యువతీయువకులు పాల్గొన్నారు. ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ తాము పడుతున్న కష్టాలను కళ్లకు కట్టించారు. సర్కారు నౌకరీల కోసం చదివేవాళ్లంతా పేద, మధ్యతరగతి కుటుంబాలేనని, వారిని దృష్టిలో పెట్టుకుని పరీక్ష ఫీజులు నామమాత్రంగా వసూలు చేయాలని, పరీక్ష కేంద్రాలను సమీపంలో కేటాయించాలని కోరారు.

జీవితాలతో ఆడుకోవద్దు..

'మేం ఉచితంగా పైసలిచ్చే పథకాలను కోరుకోవడం లేదు. నాణ్యమైన విద్యను, న్యాయబద్ధంగా నోటిఫికేషన్లను, పక్కాగా పరీక్షలను, పారదర్శకంగా ఫలితాలను కోరుకుంటున్నాం..' అని పలువురు నిరుద్యోగ యువతీయువకులు పేర్కొన్నారు. చాలా పార్టీలు ఉచిత, సంక్షేమ పథకాలపైనే దృష్టి పెడుతున్నాయే తప్పా ఉద్యోగ, ఉపాధులను పట్టించుకోవడం లేదన్నారు. పేరుకే ఉద్యోగ ప్రకటనలిస్తూ.. తమ జీవితాలతో ఆడుకోవద్దని చాలామంది కోరారు.

- **యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ఉండాలి.**
- ఒకేసారి అన్ని ఉద్యోగాలు కాకుండా ప్రతీ ఉద్యోగ ప్రకటనకు వ్యవధి ఇవ్వాలి.
- ఉద్యోగ ప్రకటన వేసేముందే న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలి.
- పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని నామమాత్రంగా పరీక్ష ఫీజులు పెట్టాలి.
- పరీక్ష కేంద్రాలను హైదరాబాద్, వరంగల్ వంటి దూరప్రాంతాల్లో కాకుండా సమీపంలో కేటాయించాలి.
- రోస్టర్, రిజర్వేషన్ విధానాల్లో లోపాలను సరిదిద్దాలి.
- ప్రాథమిక విద్య నుంచే నాణ్యమైన బోధన అందేలా చూడాలి.
- నిరుద్యోగ భృతి వంటి ఉచిత పథకాలిచ్చి యువతను ఉత్తవాళ్లను చేయొద్దు.. ఉన్నతులుగా మార్చే ఉద్యోగాలే ఇవ్వాలి.

మెగా డీఎస్సీలు ప్రకటించాలి..



విద్యావ్యవస్థ పటిష్టంగా ఉంటేనే అన్నిరంగాలు బాగుపడతాయి. పార్టీలు, ప్రభుత్వాలు ఆదిశగా ఆలోచించి మేనిఫెస్టోల్లో మెగా డీఎస్సీలు ప్రకటించాలి.

– దీప, ఎంఎస్సీ, బీఈడీ

యూపీఎస్సీ తరహాలో..



రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా ఇప్పటి నుంచి యూపీఎస్సీ తరహాలో పక్కాగా ఉద్యోగాల ప్రకటనలు, ఫలితాలు ఇవ్వాలి. కొత్త ప్రభుత్వం ఉచితాలు ఇవ్వకుండా ఉద్యోగాలు ఇవ్వాలి.

– మహేశ్, ఎంఎస్సీ, బీఈడీ

జాబ్ క్యాలెండర్ ఉంటేనే..



ఏళ్లుగా ప్రిపేరవుతున్నా ఏం లాభం ఉండటం లేదు. పార్టీలు, ప్రభుత్వాలు యువతను దృష్టిలో ఉంచుకుని, జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రకటించాలి. దానిప్రకారం నోటిఫికేషన్లు ఇవ్వాలి.

రవి, బీఈ

పేద, మధ్యతరగతి కుటుంబాలే..



ఉద్యోగాలకు చదివేవాళ్లలో చాలామంది పేద, మధ్యతరగతి వాళ్లే. ఇందులో పెళ్లయినవాళ్లూ ఉంటారు. కోచింగ్‌లకు వేలు ఖర్చు చేస్తున్నారు. అందరినీ దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ ప్రకటనలివ్వాలి.

– విజయశేఖర్, బీఎస్సీ, డీఈడీ

ఉచితాలు కాదు.. ఉద్యోగాలు కావాలి..



పార్టీలు, ప్రభుత్వాలు తమకు ఉచిత పథకాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. సకాలంలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి. నియామకాలు జరపాలి. రిటైర్‌మెంట్ వయస్సు పెంచడమూ సరికాదు.

– హైమతి, బీఎస్సీ, డీఈడీ

పరీక్ష ఫీజుల భారం తగ్గించాలి..



ఉచిత పథకాలిచ్చే ప్రభుత్వాలు నిరుద్యోగులు రాసే పరీక్షలకు మాత్రం భారీగా ఫీజులు పెంచుతోంది. ఫీజులు తగ్గించాలి. పరీక్ష కేంద్రాలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి.

– సుమలత, ఎంకామ్, బీఈడీ

ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



శిక్షణ తరగతులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్

నిర్మల్‌చైన్‌గేట్:ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. నిర్మల్‌లోని సెయింట్ థామస్ స్కూల్‌లో అసెంబ్లీ ఎన్నికలు– 2023 ఎన్నికల విధులు కేటాయించిన పీవో, ఏపీవోలకు మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పీవో, ఏపీవోలు సమన్వయంతో ఎన్నికల నిబంధనలను అనుసరించి విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పొరపాట్లు జరుగకుండా ఉండేందుకే శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు, పోలింగ్ రోజు అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, విధులు స్పష్టంగా తెలుసుకోవాలని, అన్నీ ఎన్నికల నిబంధన ప్రకారం నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ ప్రారంభానికి(90) నిమిషాల ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్, చనిపోయిన వారి వివరాలు, తదితర వివరాలను మార్క్ చేయబడి ఉంటుందని ఓటు వేయడానికి వచ్చే ఓటరు వద్ద నుంచి మొదటి ప్రాధాన్యత ఎపిక్ కార్డుతో(12) రకాల ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్మల్ రిటర్నింగ్ అధికారి రత్న కళ్యాణి, డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి శిక్షణ కోసం వచ్చిన పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ముధోల్ అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్

- కార్యకర్తల సమావేశంలో రామారావుపటేల్

భైంసాటౌన్:తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముధోల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ముధోల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని ప్రమాణం చేశారు. పార్టీలో పాత కార్యకర్తలతోపాటు కొత్తవారిని సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తానన్నారు. అంతకుముందు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పార్లమెంట్ బాధ్యులు అల్జాపూర్ శ్రీనివాస్, అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ఇన్‌చార్జి గంగారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ, స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వైఫల్యాలను ప్రజలకు వివరించడంతోపాటు బీజేపీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. ముధోల్‌లో బీజేపీ ఈసారి తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేలా దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, నారాయణ్‌రెడ్డి, పడిపెల్లి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, రాజేశ్‌బాబు, సాధ్వి రమేశ్, రమణారావు, మండల అధ్యక్షుడు, బూత్ స్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పటేల్ జయంతి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్:మానవీయమూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. భారతదేశ ప్రథమ హోంశాఖ మంత్రి పటేల్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ సమైక్యత దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా అధికారులతో కలిసి ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో...

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో 'జాతీయ ఐక్యత దినోత్సవం' సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అదనపు ఎస్పీ (ఏఆర్) వెంకటేశ్వర్లు పోలీస్ సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు ఎస్పీ(ఏఆర్) మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమగ్రత కోసం శ్రమించారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్ఐ లు రాంనిరంజన్, రమేశ్, రామకృష్ణ, ఆర్ఎస్ ఐలు, సాయుధ దళాల సిబ్బంది పాల్గొన్నారు.

'గిరిజన నిధులు దుర్వినియోగం చేశారు'



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు

భైంసాటౌన్: నియోజకవర్గంలో రోడ్డు సౌకర్యం లేని గిరిజన తండాలకు ప్రభుత్వం మంజూరు చేసిన (ఎస్టీ ఎస్‌డీఎఫ్) నిధులను స్థానిక ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దుర్వినియోగం చేశారని భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు ఆరోపించారు. ఎస్ఎస్ కాటన్‌లో మంగళవారం మాట్లాడారు. గిరిజన తండాలకు కేటాయించిన నిధులు రూ.3.4 కోట్లతో వాలేగాంలోని ఎస్టీ కాలనీ నుంచి రంగరి గుడిసెలకు, అలాగే రూ.4.12 కోట్లతో తరోడ నుంచి చింతకుంట తండాకు రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. 2020లో కుంటాల మండలం బూర్గుపల్లి నుంచి గమ్మాపూర్ తండాకు కేటాయించిన నిధులను సైతం దారి మళ్లించారన్నారు. గిరిజన నిధులను పక్కదారి పట్టించిన ఎమ్మెల్యే వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను చేసిన ఆరోపణలు అసత్యమని నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా



ప్రచారం నిర్వహిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిర్మల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని సిద్దాపూర్, గాయత్రిపురం కాలనీలలో గడప గడపకూ పర్యటించి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవినీతి అంతానికి నిర్మల్‌లో కాషాయ జెండా ఎగురవేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, సాదం అరవింద్, అయ్యన్నగారి రాజేందర్, వొడిసెల అర్జున్, అల్లం భాస్కర్, రామోజీ నరేష్, భరత్, సాయికుమార్, చరణ్ మౌర్య ఉన్నారు.

సీఎం సభలకు సన్నద్ధం

- 2న నిర్మల్, 3న భైంసాలో కేసీఆర్ ఎన్నికల ప్రచారం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి 'అల్లోల'



నిర్మల్‌లో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్:అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రజాఆశీర్వాదం పేరిట రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న సీఎం కేసీఆర్ ఈనెల 2, 3 తేదీల్లో జిల్లాకు రానున్నారు. రెండు రోజులపాటు వరుసగా జిల్లాలో బహిరంగ సభలు ఉండటంతో వాటిని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతోంది. ప్రధానంగా జనసమీకరణపైనే అభ్యర్థులు, నేతలు దృష్టిపెట్టారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రేపు నిర్మల్‌లో..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 2న నిర్మల్‌లో ప్రజాఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు పాల్గొనే ఈ సభకు పక్కాగా ఏర్పాట్లు సాగుతున్నాయి. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పార్టీ నేతలు నిర్మల్ శివారులో, సమీకృత కలెక్టరేట్ దారిలోని క్రషర్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను మంగళవారం రాత్రి పర్యవేక్షించారు. నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో పార్టీశ్రేణులతోపాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. వచ్చినవారికి వసతులు, వాహనాల పార్కింగ్ తదితర ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

3న భైంసాలో..

జిల్లాకు వెంటవెంటనే సీఎం కేసీఆర్ వస్తుండటం గమనార్హం. గత ఎన్నికల్లో ఒకే రోజులో ఖానాపూర్, నిర్మల్, భైంసాలో సభలు నిర్వహించారు. ఈసారి బుధవారం నిర్మల్, గురువారం భైంసాలో సభలు నిర్వహించనున్నారు. భైంసాలోని పార్డి(బి) రోడ్డులో బహిరంగసభ ఉండనుంది. ఇక్కడ ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పురాణం సతీశ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

మావోయిస్టులపై ప్రత్యేక నిఘా

- గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీఎం విజయ్‌కుమార్
- ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్ ఎస్పీలతో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీఎం విజయ్‌కుమార్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఎస్ఐబీ ఐజీ టి.ప్రభాకర్‌రావుతో కలిసి ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్ జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు వారు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మావోయిస్టు కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సమాచారాన్ని పరస్పరం అందించుకోవాలన్నారు. దీని ద్వారా మావోయిస్టుల నియంత్రణ సులభతరం అవుతుందన్నారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల విడుదల వరకు ప్రతీ దశలోనూ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. జిల్లాలకు అదనంగా కేటాయించిన కేంద్ర పారా మిలటరీ బలగాలతో పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించి భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచి నగదు, మద్యం అక్రమ సరఫరా వంటి అనైతిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐబీ అధికారి పి.వేణుగోపాలరావు, కుమురంభీం ఎస్పీ సురేశ్‌కుమార్, ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నిర్మల్ ఎస్పీ సీహెచ్.ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయరాఘవన్, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేశ్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లోకి ఓయూ జేఏసీ అధ్యక్షుడు



దత్తాత్రేయను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

ఆదిలాబాద్‌టౌన్: ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ అధ్యక్షుడు ఎల్చల దత్తాత్రేయ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లో మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన దత్తాత్రేయ ఓయూ జేఏసీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గరోలే లక్ష్మణ్ (39) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... లక్ష్మణ్ ఇల్లు ఇనుప పైపులు, రేకులతో నిర్మించాడు. దానికి సీలింగ్ ఫ్యాన్ బిగించారు. ఫ్యాన్ వద్ద కరెంటు తీగ తెగి రేకుల ద్వారా పైపులకు తగిలి విద్యుత్ సరఫరా అయింది. పైపులకు కట్టిన ఇనుప తీగపై ఉన్న బట్టలను తీసుకునే క్రమంలో లక్ష్మణ్ షాక్‌కు గురై కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందని నాకిడి మల్లయ్య(45) అప్పుల బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కుటుంబీకులు, పోలీసుల వివరాల ప్రకారం.. మల్లయ్య రెండేళ్ల క్రితం డెయిరీ ఫాం పెట్టడానికి స్థానికంగా అప్పులు చేశాడు. నష్టం రావడంతో డెయిరీఫాం విక్రయించాడు. అయితే డెయిరీఫాం కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జాతీయస్థాయి వుషూ పోటీలకు జిల్లా కోచ్



సాయికృష్ణను సన్మానిస్తున్న ఒమర్, సతీష్

భైంసాటౌన్: జాతీయ స్థాయి వుషూ పోటీలకు కోచ్‌గా సాయికృష్ణ ఎంపికైనట్లు జిల్లాకు చెందిన శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు గోవాలో 37వ జాతీయస్థాయి వుషూ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ఒలింపిక్ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ ఆధ్వర్యంలో అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఒమర్ ఎంపిక చేస్తూ ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు సాయికృష్ణను అభినందించారు.

కొండచిలువ కలకలం

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్లాట్ల వద్ద కొండ చిలువ కనిపించింది. 8.5 అడుగుల కొండ చిలువను గ్రామస్తులు హతమార్చారు.



లెక్క దాటితే చిక్కే!

- ఎమ్మెల్యే అభ్యర్థుల ఖర్చు పక్కాగా ఉండాల్సిందే
- రూ.40 లక్షలు మించొద్దన్న ఎన్నికల సంఘం
- తర్వాత లెక్కలు సమర్పించాల్సిందే..

జంగ్ తెలంగాణ

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు.. ర్యాలీలు.. భోజనాలు, వాహనాలు ఇలా.. ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఎన్నికల రణరంగంలో పైచేయి సాధించడానికి అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిర్దేశించింది. వీటిని పక్కాగా అమలు చేయడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించింది. సభ్యులు నిత్యం పరిశీలిస్తూ ఖర్చు లెక్కిస్తారు. హద్దు దాటితే అనర్హత వేటు పడే ప్రమాదమూ ఉంది. అభ్యర్థులూ.. తస్మాత్ జాగ్రత్త.

నామినేషన్ నుంచి అమల్లోకి...

ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికల ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరిచి దానిద్వారానే లావాదేవీలు నిర్వహించాలి. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాలు సంబంధిత పార్టీల ఖర్చు కింద జమ చేస్తారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు.

లెక్క చూపకున్నా వేటే...

ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోపు ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్కరూ తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, వ్యయానికి సంబంధించిన లెక్కలను సరైన సమయంలో చూపకున్నా సంబంధిత వ్యక్తులపై వేటు పడటంతో పాటు తర్వాతి ఎన్నికల్లో పోటీచేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది.

రూ.40 లక్షల వరకే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారం నిమిత్తం ఈసీఐ వ్యయ పరిమితిని రూ.40 లక్షల వరకు నిర్దేశించింది. పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలను ఆధారాలతో చూపకున్నా అభ్యర్థులపై వేటు వేసేలా ఎన్నికల సంఘం నిబంధనలు ఉన్నాయి.

నిరంతరం నిఘా

నామినేషన్ తర్వాత అభ్యర్థులు చేసే ప్రతీ కార్యక్రమాన్ని వ్యయ పరిశీలకులు వెంటాడుతారు.

- అభ్యర్థులు ప్రచారాలు, సభలు సమావేశాలకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. వాటి ప్రకారం ఆయా కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు వీడియోలు తీసుకుంటారు.
- అనంతరం వాటిని పరిశీలించి సభలు, సమావేశాలకు ఎన్ని కుర్చీలు వేశారు, ఎన్ని టెంట్లు వేశారు. ఎన్ని మైక్‌సెట్లు పెట్టారు. ఎన్ని వాహనాలు వచ్చాయి, ఎంత మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఖర్చు లెక్కించి షాడో రిజిస్టర్లో నమోదు చేస్తారు. అభ్యర్థులు కూడా పోలింగ్ నాటికి ఖర్చు వివరాలను మూడు పర్యాయాలు అకౌంటింగ్ టీంతో తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఆహార పదార్థాలు

లీటర్ నీటి సీసా	: రూ.20
చికెన్ బిర్యానీ	: రూ.140
మటన్ బిర్యానీ	: రూ.180
పులిహోర	: రూ.30
భోజనం	: రూ.80
సమోసా	: రూ.10
టిఫిన్	: రూ.35
చాయ్	: రూ.7

అద్దె గది

గెస్ట్ హౌస్ ఏసీ(సింగిల్)	: రూ.1,150
గెస్ట్ హౌస్ (డబుల్స్)	: రూ.1600
హోటల్స్ నాన్ఏసీ	: రూ.800
డ్రైవర్స్	: రూ.400

వాహనాల అద్దె

డీసీఎం వ్యాన్	: రూ.3,000
మినీ బస్	: రూ.3,500
ఇన్నోవా	: రూ.4,000
బస్	: రూ.6,000
జీపు	: రూ.1,200
టెంపో (ట్రావెలర్)	: రూ.2,600
సుమో, క్వాలీస్, కారు	: రూ.1,250
టవేరా	: రూ.1,575
బొలెరో	: రూ.1,450
స్కార్పియో	: రూ.1,875
ఆటో	: రూ.500

ఎన్నికల సంఘం నిర్దేశించిన అభ్యర్థుల రోజు ఖర్చు వివరాలు

- మైకులు 2, ఆంప్లిఫేర్ 1, మౌత్ పీస్ : రూ.1,300
- మైకులు 12, ఆంప్లిఫేర్ 1, మౌత్ పీస్ 3 : రూ.4,200
- మినీసభ స్టేజీ, లైటింగ్, సౌండ్స్ రూ.8 వేల నుంచి రూ.12 వేలు
- వీఐపీ కుర్చీ సింగిల్ రూ.270, డబుల్ రూ.375
- టెంటు 18/36: రూ.1,500, 12/24 : రూ.800
- క్లాత్ బ్యానర్ : రూ.325 నుంచి రూ.380
- కటౌట్ ఉడెన్ : రూ.270
- క్లాత్ కటౌట్, ఆర్చ్ : రూ.1,520,
- ప్లెక్సీ 12/8 : రూ.1,800
- వీడియోగ్రఫీ : రూ.1,850
- డ్రోన్ కెమెరా : రూ.5,000

చెన్నూర్‌కు మంత్రుల చరిత్ర

- నాటి నుంచి నేటి వరకు ముగ్గురికి మంత్రివర్గంలో చోటు
- చెన్నూర్ నుంచి గెలిస్తే మంత్రి పదవి..!



రాజమల్లు బోడ జనార్దన్ గడ్డం వినోద్

చెన్నూర్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి 1952 నుంచి ఇప్పటి వరకు 12 సార్లు ఎన్నికలు జరుగగా 8 మంది శాసన సభకు ఎన్నికయ్యారు. నాడు రాష్ట్రంలోనే వెనుకబడిన నియోజకవర్గంగా గుర్తింపు ఉండడంతో చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వారిలో ముగ్గురికి మంత్రివర్గంలో చోటు దక్కింది. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందిన బోడ జనార్దన్, గడ్డం వినోద్ కార్మికశాఖ మంత్రులుగా, కోదాటి రాజమల్లు ఆరోగ్యశాఖ మంత్రిగా సేవలందించారు. అభివృద్ధిలో తమ మార్క్‌ను సొంతం చేసుకున్నారు.

కోదాటి రాజమల్లు

1962లో చెన్నూర్ ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కోదాటి రాజమల్లు విజయం సాధించారు. 1962 నుంచి 1972 వరకు మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన రాజమల్లు మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆయన హయాంలోనే చెన్నూర్‌లో 30 పడకల ఆస్పత్రి నిర్మించారు.

బోడ జనార్దన్

బోడ జనార్దన్ అటవీశాఖలో పనిచేస్తున్న సమయంలోనే 1985లోనే తెలుగుదేశం పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వచ్చింది. 1985 నుంచి 1999 వరకు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు.

గడ్డం వినోద్

మాజీ ఎంపీ స్వర్గీయ గడ్డం వెంకటస్వామి తనయుడు గడ్డం వినోద్ 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి టీడీపీ అభ్యర్థి బోడ జనార్దన్‌పై విజయం సాధించారు. తెలుగుదేశం కంచుకోటలో పాగా వేసిన వినోద్‌కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మంత్రి వర్గంలో కార్మికశాఖ మంత్రిగా అవకాశం దక్కింది. ఆయన హయాంలో చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో 133 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి కృషి చేశారు.

'బౌండ్‌డౌన్' అంటే తెలుసా?



నెన్నెలలోని తహసీల్దార్ కార్యాలయం

నెన్నెల(బెల్లంపల్లి): ఇప్పటి వరకు బైండోవర్ అంటే అందరికీ తెలుసు. బౌండ్‌డౌన్ అంటే చాలా మందికి తెలియదు. బైండోవర్ అంటే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి ఒప్పందం కుదుర్చుకుంటారు. అవసరమైతే ఒకరి పూచికత్తు తీసుకుని బాండ్ పేపర్ రాయించుకుంటారు. బాండ్ పేపర్‌లో పేర్కొన్న జరిమానా చెల్లించకుంటే పూచికత్తు ఇచ్చిన వారి నుంచి వసూలు చేసే వీలుంది. దీనినే బైండోవర్ చేయడం అంటారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాదు.. పండుగల సందర్భంలోనూ బైండోవర్ చేస్తుంటారు.

వర్తింపు ఇలా...

బైండోవర్ సమయంలో ఇచ్చిన మాటను అతిక్రమించడమే బౌండ్‌డౌన్. వ్యక్తిగతంగా హాజరై రాతపూర్వకంగా ఇచ్చిన హామీని మితిమీరడం అంటే చట్టాన్ని ఉల్లంఘించడమే. అయితే ఇది క్రిమినల్ కేసు కాదు. పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం లేకపోయినా ఈ విషయాన్ని తహసీల్దార్‌కు నివేదించవచ్చు. వాటికి అనుగుణంగా ఆ అధికారి చర్యలు తీసుకోవచ్చు. బైండోవర్ అయిన వ్యక్తి శిక్ష తప్పించుకునేందుకు పై కోర్టులను ఆశ్రయించవచ్చు. ఇదంతా బౌండ్‌డౌన్ చేసిన వారి వివరాలతో పోలీసులు రిపోర్ట్ చేసినప్పుడే వీలవుతుంది. కానీ చాలా సందర్భాల్లో పోలీసులు అంత వరకు వెళ్లడం లేదు.

తహసీల్దార్‌కు న్యాయపరమైన అధికారాలు

మండల రెవెన్యూ అధికారి అంటే తహసీల్దార్ అనుకుంటాం. కానీ ఆయన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కూడా. ఆయనకు కొంతవరకు న్యాయపరమైన అధికారాలు కూడా ఉంటాయి. ఈ కారణంగా పోలీసులు బైండోవర్ చేసే సమయంలో తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. బైండోవర్ తర్వాత ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పు రాకపోతే సమండ్లు జారీ చేసేందుకు జైలుకు పంపించే అధికారం తహసీల్దార్‌కు ఉంది. తప్పు, నేరాన్ని బట్టి బైండోవర్ సమయంలో నిర్దేశిత జరిమానా (రూ.500 నుంచి రూ.లక్ష) విధిస్తుంటారు. మొత్తాన్ని నిర్ణయించవచ్చు. వీటిని చలానా రూపంలో రాష్ట్ర ఖజానాకు చెల్లించాల్సి ఉంటుంది.

ముహూర్తం మంచిగున్నదా..!

- నామినేషన్ ఎప్పుడు వేయాలి?
- పండితులను వాకబు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు

నిర్మల్‌ఖిల్లా: నవంబర్ 3 నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండడంతో ఆయా రాజకీయ పార్టీల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్న వారు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గ్రామాల బాట పట్టారు. టికెట్లు ఖరారైన అభ్యర్థులంతా నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్ నామినేషన్లు స్వీకరించేందుకు జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లను ఎప్పుడు వేస్తే బాగుంటుందో ముహూర్తాల కోసం పండితులను సంప్రదిస్తున్నారు. ముహూర్తం ఎప్పుడు బాగుంది? నామినేషన్ ఏ రోజు వేస్తే విజయావకాశాలు ఉంటాయో చెప్పాలని పండితులను అడుగుతున్నారు. తమకు విజయం చేకూరేలా మంచి ముహూర్తం చూడాలని కోరుతున్నారు. నవంబర్ 3, 6, 9 తేదీల్లో నామినేషన్లు వేసేందుకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు బ్రాహ్మణ పండితులు పేర్కొంటున్నారు. దీంతో ఆయా తేదీల్లోనే నామినేషన్లను దాఖలు చేసేందుకు ఎమ్మెల్యే అభ్యర్థులు ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

దేశ సమగ్రతను పెంచేందుకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

ఉట్నూర్‌రూరల్: భారతదేశ ఐక్యమత్యం, సమగ్రతను పెంపొందించడానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశ ఐక్యమత్యం, సమగ్రత, భద్రతలను కాపాడడానికి పునరంకితం చేయడానికి కృషి చేయాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని, దేశ సమైక్యతకు పునరంకితం కావాలనే భావన ప్రతీ ఒక్కరిలో ఇనుమడింపజేసే విధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రాథోడ్ భీంరావు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మహిళ గాలిపెల్లి గంగమ్మ ఇంటి బయట ఉండగా ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు, యువకులు మంటలు అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లిందని బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

నేడు కూతురు శ్రీమంతం..

అయితే బుధవారం గంగమ్మ కూతురు శ్రీమంతం నిర్వహించేందుకు సిద్ధమైంది. అనుకోని రీతిలో ఇంట్లో అగ్నిప్రమాదంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కూతురు ఫంక్షన్ కోసం తీసుకువచ్చిన రూ.20వేల నగదు సైతం మంటల్లో కాలిబూడిదైందని, నిత్యావసర సరుకులు సైతం పూర్తిగా కాలిపోయాయని కూతురు శ్రీమంతం ఎలా చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ఢిల్లీలో దుబార్‌పేట్ ఆదివాసీ కళాకారులు



దుబార్‌పేట్ ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: దేశ రాజదాని ఢిల్లీలో మంగళవారం జరిగిన మేర మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో మండలంలోని దుబార్‌పెట్‌కు చెందిన ఆదివాసీ కళాకారులు నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. సౌత్‌జోన్ సెంట్రల్ కల్చరల్ పిలుపు మేరకు ఆదివాసీ కళాబృందం సభ్యులు కాత్లె శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రదర్శణ ఇచ్చారు. ఆదివాసీ కళాకారులు బృందం సభ్యులు కాత్లె శ్రీధర్ మాట్లాడుతూ... ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దుబార్‌పెట్‌కు చెందిన 8 మంది కళాకారులు ఢిల్లీ వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ కళాకారులు ద్వారా నృత్యం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం సేవించి వాహనం నడిపిన 10మందికి ఒక్కరోజు సాధారణ జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పోలీస్ లైజన్ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మేడిపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య, గొల్లమాడకు చెందిన లస్మన్న, కంకటకు చెందిన అశోక్, దిల్‌వార్‌పూర్‌కు చెందిన ప్రసాద్, అశోక్, కడ్తల్‌కు చెందిన గంగారెడ్డి, నర్సాపూర్ మండలానికి చెందిన దయాకర్, ముజ్గికి చెందిన గంగాధర్, జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్, వసీం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని నిర్మల్ కోర్టులో హాజరు పరచగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రహేమాన్ ఒక్కొక్కరికి ఒక్కరోజు సాధారణ శిక్ష, 10మందికి రూ.9 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు నిచ్చారు.

బాలికను హత్య చేసిన దుండగులను శిక్షించాలి



సీఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ బాలికను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని భీంజీగూడలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఘటనపై ఆరా తీశారు. సచిన్ మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థిని హత్య జరిగి నాలుగు రోజులు గడుస్తున్న పోలీసులు ఇప్పటి వరకు నిందితులను పట్టుకోకపోవడం సరికాదని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీఐ రామకృష్ణకి వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, మండల అధ్యక్షుడు కనక మల్కు, కార్యదర్శి మడావి నాగోరావు ఉన్నారు.

మహారాష్ట్రకు బస్సులు బంద్

- మూడురోజులుగా నిలిచిన సర్వీసులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

భైంసాటౌన్: మహారాష్ట్రలో మరాఠాలు ప్రత్యేక కోటా డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనలు అక్కడ హింసాత్మక రూపం దాల్చాయి. ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలంటూ ఆందోళనకారులు బంద్‌కు పిలుపునివ్వడంతో ముందస్తు జాగ్రత్తగా జిల్లా ఆర్టీసీ అధికారులు ఆయా డిపోల నుంచి మహారాష్ట్ర రూట్‌లో బస్సు సర్వీసులు నిలిపివేశారు. ఫలితంగా జిల్లా నుంచి మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా నుంచి రాకపోకలు..

మన జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో ఇక్కడి వారికి మహారాష్ట్రతో సంబంధాలున్నాయి. మహారాష్ట్రవాసులు చాలామంది జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. తానూర్, బాసర, ముధోల్, భైంసా, కుభీర్, కుంటాల, సారంగాపూర్, నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తారు. వ్యాపార రీత్యా నిర్మల్, భైంసా నుంచి వ్యాపారులు సరుకు ఖరీదు కోసం వెళ్తుంటారు. వాణిజ్య కేంద్రమైన నాందేడ్‌కు జిల్లా నుంచి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.

మూడురోజులుగా బంద్...

భైంసా డిపో నుంచి నాందేడ్, ధర్మాబాద్, కర్కెల్లి, హిమాయత్ నగర్, ఇస్లాపూర్, శివుని–అప్పారావుపేట్ రూట్లలో బస్సులు నడుస్తుండగా నిర్మల్ డిపో నుంచి నాందేడ్, కిని–పాలజ్, కిన్వట్, శివుని, చంద్రాపూర్, పర్బని, అకోలా, నాగ్‌పూర్ తదితర రూట్లలో బస్సు సర్వీసులు నడుస్తాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో ఆందోళనల నేపథ్యంలో ఆయా రూట్లలో మూడురోజులుగా బస్సులు నిలిపేశారు.

మహారాష్ట్ర రూట్లలో సర్వీసులు నిలిపేశాం

మహారాష్ట్రలో ఆందోళనల నేపథ్యంలో అక్కడి పోలీసు అధికారులు కొద్దిరోజులు ఆయా రూట్లలో బస్సు సర్వీసులు నడపవద్దని సూచించారు. దీంతో ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తగా బస్సులు నడపడం లేదు. ధర్మాబాద్ రూ ట్‌లో బిద్రెల్లి వరకు బస్సు నడుపుతున్నాం. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలి.


– ఎం.అమృత, డిపో మేనేజర్, భైంసా

బస్సుల బంద్ విషయం తెలియదు



నాందేడ్‌కు వెళ్లేందుకు భైంసా బస్టాండ్‌లో ఎదురుచూసినా బస్సు రావడం లేదు. విచారణ అధికారికి అడిగితే మహారాష్ట్రకు బస్సులు బంద్ చేసినట్లు చెప్పారు. ముందే విషయం తెలిస్తే వేరే మార్గం చూసుకునేవాళ్లం. – గంగాధర్, ప్రయాణికుడు

ఇబ్బంది అవుతోంది..



హిమాయత్‌నగర్‌లోని బంధువుల ఇళ్లకు వెళ్లాలని బస్టాండ్‌కు వస్తే మహా రాష్ట్రకు బస్సులు బంద్ ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పుడు ఎలా వెళ్లాలో తెలియడం లేదు. మాలాంటి వారికి ఇబ్బంది అవుతుంది.

– దత్తు దేవన్న, ప్రయాణికుడు

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నియమావళి అమలులో ఉండగా అనుమతులు లేకుండా జన్మదినం సందర్భంగా కటౌట్‌ను ఏర్పాటు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డుకు చెందిన సెల్కే జయరాం తన బర్త్‌డే సందర్భంగా కలెక్టర్ చౌక్‌లో 15ఫీట్ల కటౌట్‌ను ఏర్పాటు చేశాడు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేయడంపై కేసు నమోదు చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.